క్లుప్తంగా

అన్నదానం



అన్నదానం చేస్తున్న ఆదినారాయణ రెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరులోని శ్రీవీర బ్రహ్మేంద్ర స్వామి వృద్ధాశ్రమంలో దివంగత పోలిరెడ్డి ఆదినారాయణ రెడ్డి జ్ఞాపకార్థం ఆయన మనుమడు ఆదినారాయణ రెడ్డి వృద్ధులకు గురువారం అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం వారంతా దాతకు ధన్యవాదాలు తెలియజేశారు.

సరుకులు పంపిణీ



ప్రొద్దుటూరులో పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు : అమ్మ హెల్పింగ్ హ్యాండ్-కువైట్ వారి ఆధ్వర్యంలో కాకర్ల కేశవ రెడ్డి జ్ఞాపకార్థం ఆమె కుమార్తె చంద్ర కళావతి, అల్లుడు అన్నంరెడ్డి వెంకటరమణారెడ్డి సహకారంతో పేదలకు నిత్యావసర సరుకులను గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మురుకూటి సూర్య నారాయణ రెడ్డి , వికసిత ఫౌండేషన్ చైర్మన్ శూలం లక్ష్మీదేవి వచ్చారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి మాట్లాడుతూ పేదలకు చేయూత ఇవ్వడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మల్లి యాద్, రుక్మిణి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష



వెల్లాలలో ప్రవేశ పరీక్ష రాసేందుకు వెళుతున్న విద్యార్థినులు

రాజుపాళెం : మండలంలోని వెల్లాలలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకులం పాఠశాలలో 6, 7, 8, 9 తరగతులలో ఖాళీ సీట్ల భర్తీకి గురువారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 24 సీట్ల భర్తీకి గాను నోటిఫికేషన్ విడుదల చేశారు. మొత్తం సీట్లకు గాను 143 మంది విద్యార్థినులు దరఖాస్తు చేసుకోగా 123 మంది పరీక్షకు హాజరయ్యారు. వారు పరీక్ష రాసేందుకు 6 గదులను కేటాయించి పరీక్ష నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ తులశమ్మ తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కల్లూరు హోమియో వైద్యుడు మునిరాంప్రసాద్ పేర్కొన్నారు. అమృతానగర్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్, జెడ్పీహైస్కూల్‌లోని విద్యార్థులకు సీజనల్ వ్యాధులు రాకుండా గురువారం ముందస్తు నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిశుభ్రం వాతావరణంలో ఉంచిన ఆహార పదార్థాలను తీసుకోరాదన్నారు. లేకుంటే డయేరియా వచ్చే ప్రమాదం ఉందన్నారు. మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, పాలు, గుడ్లు, ఆకుకూరలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విమల, ఏఎన్ఎం ఓబులమ్మ, సీహెచ్ఓ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు. 3

గ్రూప్ 2 మెయిన్స్‌కు అదనపు సమయం ఇవ్వాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ అభ్యర్థుల సమస్యలను గుర్తించి మెయిన్స్ పరీక్షకు మరింత అదనపు సమయం ఇవ్వాలని కోరుతున్నామని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ తెలిపారు. గురువారం నగరంలోని డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష జూలై 28 నుండి నిర్వహిస్తామని ప్రకటించారన్నారు. అయితే ఎన్నికలు జరిగిన దృష్ట్యా అభ్యర్థులు ప్రిపరేషన్లో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. అలాగే సిలబస్ ఎక్కువగా ఉన్నదని, ఈ రెండు కారణాల దృష్ట్యా గ్రూప్-2 మెయిన్స్ పరీక్ష జూలై 28 నుండి కాకుండా, మరో 2 నెలలు పాటు వాయిదా వేయాలని కోరారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నరసింహులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

కడప ఎడ్యుకేషన్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్ అన్నారు. గురువారం కడప నగరం ఎర్రముక్కపల్లె గాంధీ నగర్ మున్సిపల్ హైస్కూల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులచే న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యాచట్టాలు, మంచి, చెడు స్పర్శ, విద్యాహక్కు, బాల కార్మిక నిరోధక చట్టం వంటి పలు చట్టాల గురించి పిల్లలకు వివరించారు. అలాగే టోల్ ఫ్రీ నెంబర్ 100, 1098, 15100, పోక్సోచట్టం మొదలగు అంశాల గురించి కూడా వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ మహేష్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులు పంటకు బలం

రాయితీపై విత్తనాలు సరఫరా

కాశినాయన : పచ్చిరొట్ట ఎరువులు పంటకు బలం చేకూరుస్తాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. జూన్ నెలలో ప్రభుత్వం 50 శాతం సబ్సిడీతో జీలుగలు, పిల్లిపెసర, జనుములను రైతులకు అందజేసింది. రైతులు ఇటీవల కురిసిన వర్షాలకు వీటిని భూమిలో చల్లి దున్నారు. రెండు, మూడు అడుగులు పంట పెరిగిన తర్వాత తిరిగి సేద్యాలు చేయడం వల్ల భూమి సారవంతమవుతుంది. దీంతో పంటలకు రసాయనిక ఎరువుల వాడకం తగ్గుతుంది. జనుములు, జీలుగ, పిల్లిపెసర, ఉలవ రకాల పచ్చిరొట్ట పైర్లలో స్థూల పోషకాలు ఉంటాయి. నత్రజని 1.8 శాతం నుంచి 3.5 శాతం, భాస్వరం 1 శాతం నుంచి 0.3 శాతం, పొటాషియం 0.5 శాతం నుంచి 0.3 శాతం ఉంటాయి. స్థూల పోషకాలతోపాటు సూక్ష్మపోషకాలు కూడా భూమికి లభిస్తాయి.

గుళికలతో నష్టం

పంటలకు ఆశించిన తెగుళ్ల నివారణకు రైతులు గుళికలను అధికంగా వాడటంతో భూమి లోపల సూక్ష్మజీవులు నశించిపోతున్నట్లు శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది. గతంలో ఒక గ్రాము మట్టికి కోట్లాది సూక్ష్మజీవులు ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య లక్షల్లో పడిపోయినట్లు పరిశోధనల్లో తేలింది. పచ్చిరొట్ట పైర్లను భూమిలో కలియదున్నడంతో సూక్ష్మజీవులు అభివృద్ధి చెందే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు తెలిపారు.



రెడ్డికొట్టాలలో సాగు చేసిన జీలుగ పంట

పచ్చిరొట్ట పంటలు సాగు చేయాలి

రైతులు ఖరీఫ్, రబీ సీజన్ల మధ్య పొలాల్లో పచ్చిరొట్ట పంటలు సాగు చేసుకోవాలి. దీంతో భూసారం పెరిగి పంట దిగుబడి అధికంగా వస్తుంది. పంట కోసిన వెంటనే పదునుపై పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకోవాలి. విత్తనాలను ఇప్పటికే ఆర్బీకేల ద్వారా రైతులకు సబ్సిడీతో అందజేశాం. రైతులు పచ్చిరొట్ట పంటలపై దృష్టి సారించి అధిక దిగుబడులు పొందవచ్చు.

– ప్రవీణ్‌కుమార్, వ్యవసాయాధికారి, కాశినాయన మండలం

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

ప్రొద్దుటూరు : ఎమ్మార్పీఎస్ ప్రొద్దుటూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా బాలయ్య మాదిగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మానికింది వెంకటేష్ గురువారం తెలిపారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జులై 7వ తేదీన ఎమ్మార్పీఎస్ 30 సంవత్సరాల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఛలో వరంగల్ వెళుతున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని మాదిగలంతా విజయవంతం చేయాలని వెంకటేష్ కోరారు. అలాగే ప్రొద్దుటూరు మండల అధ్యక్షుడిగా చాపాటి నాగరాజు మాదిగ, ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షుడిగా సగబాల ఓబులేసు మాదిగ, రాజుపాళెం మండల అధ్యక్షుడిగా ఓబుళపతిగాళ్ల రామకృష్ణ మాదిగ, రాజుపాళెం మండల ఉపాధ్యక్షులుగా చింతల చంద్ర మాదిగను యాడికి రమేష్ ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంఎస్పీ మండల అధ్యక్షుడు ఓబయ్య మాదిగ, బీసీ నాయకులు వెంకట ప్రసాద్, మనోజ్, రవి పాల్గొన్నారు.

మాదిగ జనజాతరను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న బ్రహ్మయ్య మాదిగ

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రకాశం జిల్లాలోని ఈదుముడి గ్రామంలో జులై 7న నిర్వహించే మాదిగ జనజాతరను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్యమాదిగ తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీవర్గీకరణ కోసం ఉద్యమం ప్రారంభమై 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సభ నిర్వహిస్తున్నామన్నారు. ఎస్సీ రిజర్వేషన్‌లను ఏ,బీ,సీ,డీలుగా వర్గీకరించాలని ప్రారంభమైన ఎమ్మార్పీఎస్ ఉద్యమం సమాజంలోని అన్ని పీడిత వర్గాలకు అండగా నిలిచిందన్నారు. మాదిగలు బహిరంగ సభలో పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ఎం రాజా, నాయకులు నరసింహులు, ఎల్లయ్య, పుల్లయ్య, శ్రీనివాస్, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి సారించాలి



సర్టిఫికెట్లను అందుకుంటున్న ఉపాధ్యాయులు

మైదుకూరు : విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి సారించాలని వక్తలు పేర్కొన్నారు. మైదుకూరులోని మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలో గురువారం హ్యాండ్ వాష్‌పై ఒక రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని సూచించారు. పాఠశాలల్లోని మరుగుదొడ్లను ప్రతి రోజు రెండు సార్లు శుభ్రం చేయించాలని తెలిపారు. విద్యార్థులు అపరిశుభ్రంగా ఉంటే వారి ఆరోగ్యం, చదువుపై ఆ ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. భోజనానికి ముందు, టాయిలెట్‌కి తర్వాత సబ్బుతో చేతులు, కాళ్లు శుభ్రం చేసుకోవాలని సూచించారు. అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులకు ముఖ్య అతిథులు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఎంఐఎస్ ప్లానింగ్ కో-ఆర్డినేటర్ రాజు, మండల ఎంఈఓలు పద్మలత, నరహరి శర్మ, డీబీఎస్ఐ జిల్లా సమన్వయకర్త విష్ణువర్ధన్, రిసోర్స్‌పర్సన్ దేవరాజు, వలంటీర్లు రహమతున్నీసా, శివశంకర్, మోతే ఉపేంద్ర, నరేష్, మండలంలోని 75 పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశోధకుడికి డాక్టరేట్



వైవీయూ: యోగివేమన విశ్వ విద్యాలయం రాజ నీతి శాస్త్రం, ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగం పరిశోధకుడు సి. ప్రవీణ్‌కుమార్‌కు విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. విశ్వవిద్యాలయ రాజనీతిశాస్త్ర ఆచార్యులు డా. జి. పార్వతి పర్యవేక్షణలో 'ఇంపాక్ట్ ఆఫ్ డీ సెంట్రలైజేషన్ ఆన్ సర్వీస్ డెలివరీ సిస్టం ఎ స్టడీ ఆఫ్ సెలెక్టెడ్ విలేజ్ సెక్రటేరియట్ ఇన్ కర్నూలు డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' అన్న అంశంపై ఈయన చేసిన పరిశోధనకు గాను ఈయనకు డాక్టరేట్ ప్రదానం చేశారు.

చికెన్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

కడప అర్బన్: కడప నగరంలోని అప్సరా కూడలి నుంచి చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ దారిలో వున్న రెడ్డి చికెన్ సెంటర్‌లో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పైగదిలో వున్న పాత సామాగ్రితో పాటు వున్న వస్తువులన్నీ పూర్తిగా కాలిపోయాయి. చికెన్ సెంటర్ యజమాని ఫిర్యాదు మేరకు ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి మంటలను అదుపు చేశారు. దాదాపు రూ. 50 వేలు ఆస్తినష్టం జరిగింది. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని ఫైర్ అధికారులు సూచిస్తున్నారు.

'నా కుమారుడిని చంపిన వారిని శిక్షించాలి'

కడప రూరల్ : తన కుమారుడిని చంపిన వారిని శిక్షించాలని కడప నగరం పాతకడపకు చెందిన పాలకొండయ్య కోరారు. గురువారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన కుమారుడు సుబ్బరాయుడు భార్య వేరొకరితో అక్రమ సంబంధం పెట్టుకుందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో 2020వ సంవత్సరంలో తన కుమారుడు హత్యకు గురయ్యాడని తెలిపారు. దీనిపై విచారణ చేపట్టి న్యాయం చేపట్టాలని కోరారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి



ఎంపీపీ పాఠశాలలో చేరిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మైదుకూరు : బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి రాజగోపాల్ రెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో గురువారం విద్యా ప్రవేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించేలా తల్లిదండ్రులను చైతన్యపరచాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తమ దగ్గర ఉన్న పిల్లలను బడిలో చేర్పించేలా అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాల, సమాజం మధ్య మెరుగైన సంబంధాలను ఏర్పచాలని తెలియజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ సిబ్బంది, సచివాలయ ఎడ్యుకేషన్ సహాయకులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

కాశినాయన : ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని ఆకులనారాయణపల్లె ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్రమణ్యం పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రంలో 5 ఏళ్లు పూర్తి చేసుకున్న ఏడుగురు పిల్లలను గురువారం ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలకు పౌష్టికాహారంతోపాటు ఉచితంగా యూనిఫాంలు, బూట్లు, టెస్టు పుస్తకాలు, నోటుపుస్తకాలు, టై, బెల్టు ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రమణారెడ్డి, అంగన్వాడీ కార్యకర్త తులసమ్మ, ఆయా సుబ్బలక్షుమ్మ పాల్గొన్నారు.

శిక్షణా తరగతులను జయప్రదం చేయండి

రాయచోటి అర్బన్ : కాకినాడలో జూలై 8, 9, 10 తేదీలలో నిర్వహించే రాష్ట్రస్థాయి విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలో ఆయన ఏఐఎస్ఎఫ్ నేతలతో కలసి శిక్షణా తరగతుల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు రాజకీయాలపైన ఆసక్తిని కనబరచాలన్నారు. విద్యార్థి దశలోనే ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. చదువుతోపాటు విద్యావ్యవస్థలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై పోరాటాలు చేయడం ఎలా అనే అంశంపై శిక్షణా తరగతులలో అవగాహన కల్పిస్తామన్నారు.

బీసీ హాస్టళ్ల సమస్యలను పరిష్కరించాలి



హాస్టల్ వార్డెన్ బ్రహ్మంతో మాట్లాడుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : బీసీ హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని పలు బీసీ సంక్షేమ హాస్టల్‌లను గురువారం సందర్శించి విద్యార్థులను, వార్డెన్‌లతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. బాత్రూంల డోర్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, కిటికీలు దెబ్బతినడంతో దోమల బెడద ఎక్కువగా ఉందని మోడంపల్లె సాంఘీక సంక్షేమ శాఖ వసతి గృహ వార్డెన్ బ్రహ్మం మాట్లాడారు. జమ్మలమడుగు బైపాస్ రోడ్డు రాజేశ్వరి కాలనీలోని బీసీ సంక్షేమ వసతి గృహంలో వార్డెను సురేష్‌బాబును అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీసీ సంఘనాయకులు మాట్లాడుతూ హాస్టల్ బిల్లులు నెలల తరబడి మంజూరు కాకపోవడంతో వార్డెన్లు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం స్పందించి బీసీ హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. హాస్టల్‌లను పరిశీలించిన వారిలో జాతీయ బీసీసంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య యాదవ్, జిల్లా కన్వీనర్ మాదాసు మురళీ, ఉపాధ్యక్షుడు ప్రతాప్, సత్యసాయి, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఉపాధ్యాయులు

కలసపాడు : కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో పని చేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎం.శేఖర్‌బాబు తెలిపారు. ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని పెండ్లిమర్రి వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో పని చేస్తూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద, బడుగు, బలహీన వర్గాల విద్యాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, సీఆర్టీలు, బోధనేతర సిబ్బంది సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అన్నారు. సీఆర్టీలకు మినిమల్ టైమ్ స్కేలు వర్తింపు విషయంలోనూ, క్రమబద్ధీకరించడంలోనూ ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కించడం సరికాదన్నారు. పనితీరు సూచికలు, విద్యార్థుల ఉత్తీర్ణత శాతం ఆధారంగా సర్వీసును రెన్యువల్ చేస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. వార్డెన్ పోస్టులు, నైట్ వాచ్‌మెన్ పోస్టును మంజూరు చేసి ప్రభుత్వ ఉపాధ్యాయులకు వర్తించే అన్నిరకాల సెలవులు వర్తింపజేయాలన్నారు. కేజీబీవీ సిబ్బంది సమస్యలను నూతన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.వెంకటరెడ్డి, బి.ఎస్.వి.ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యుడు ఎస్.శివారెడ్డి, జిల్లా కౌన్సిలర్ కె.విజయభాస్కర్‌రెడ్డి, మహిళా కార్యదర్శి బేబీసరోజ, స్పెషల్ ఆఫీసర్ రెడ్డిజ్యోతి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతను పాటించాలి



కస్తూర్బా స్కూల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న వైద్యాధికారి రాజేష్‌కుమార్

చాపాడు : విద్యార్థులకు కలుషితం లేని ఆహారం, మంచినీరు అందించాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించేలా చర్యలు తీసుకోవాలని మండల వైద్యాధికారి డా.రాజేష్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం మండల వైద్యాధికారి రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులు గదులు, మరుగుదొడ్లు, వంటశాల, కూరగాయలు, సరకులను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ కస్తూర్బా గురకుల పాఠశాలలో అధికంగా పేద విద్యార్థులు చదువుకుంటున్నారని, ఇక్కడి సిబ్బంది బాధ్యతతో విద్యార్థుల పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించేలా దృష్టి పెట్టాలన్నారు. ప్రతి రోజూ విద్యార్థులకు అందించే మూడు పూటల ఆహార పదార్థాలను సిబ్బంది పరిశీలించాలన్నారు. అనంతరం విద్యార్థులతో సమావేశమైన వైద్యాధికారి వారికి వ్యక్తిగత పరిశుభ్రత అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా ప్రిన్సిపాల్ నాగలక్షుమ్మ, సీహెచ్ఓ మహదేవ యాదవ్, హెల్త్ సూపర్‌వైజర్ సరస్వతీ, ఏఎన్ఎం స్రవంతి, ఆశ కార్యకర్త పెర్సి, కస్తూర్బా వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

చియ్యపాడు, చిన్నగురువళూరు ఉన్నత పాఠశాలలను పరిశీలించిన డిప్యూటీ డీఈఓ కృష్ణప్ప



మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ కృష్ణప్ప

చాపాడు : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిప్యూటీ డీఈఓ కృష్ణప్ప అన్నారు. మండలంలోని చియ్యపాడు, చిన్నగురువళూరు గ్రామాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో గురువారం డిప్యూటీ డీఈఓ కృష్ణప్ప పర్యటించారు. ఆయా పాఠశాలలోని నిర్వహించిన మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం డిప్యూటీ డీఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందించే ప్రతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 2024–25 ఏడాదిలో పదో తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులకు అర్థవంతమైన, ప్రణాళికాబద్ధమైన విద్యను అందించాలన్నారు. అనంతరం ఆయా పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు, సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ- 2 వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లా వ్యాప్తంగా అనుమతి లేకుండా నడుస్తున్న చైతన్య, నారాయణ, ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి శేఖర్ కోరారు. గురువారం ఈ మేరకు జిల్లా విద్యా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మున్నీర్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు పాఠశాలలోనే పాఠ్య పుస్తకాలను అమ్ముతూ వేల రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు.

29 నుంచి మహాయాగం

కడప కల్చరల్ : కడప నగరానికి చెందిన ఆధ్యాత్మ విద్యా ప్రతిష్టానం ఆధ్వర్యంలో ఈనెల 29, 30 తేదీలలో దశకోటి కృష్ణ మంత్ర మహాయాగం, శ్రీ సరస్వతి మహాయాగం నిర్వహించనున్నామని సంస్థ ప్రతినిధి పండిత డాక్టర్ మాళిగి విద్యానిధి ఆచార్య తెలిపారు. గురువారం కడప బ్రాహ్మణ వీధిలోని శ్రీ జూల్ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఆయన ఇతర ప్రతినిధులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. శనివారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని, సాయంత్రం 6.30 గంటలకు శ్రీ సత్యభామ రుక్మిణి సమేత కృష్ణ పరమాత్ముడి వివాహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటలకు దశకోటి కృష్ణ మంత్ర జప మహాయాగం, సరస్వతీ మహాయాగం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ఆనంద తీర్థ, గుండూరావు, విజయసింహా, శ్యామసుందర్, కొనూరుగోపి, కట్టి రంగవిఠల్‌రావు, భానుజీరావు, మురళి, అరుణాదేవి, వేదవతి, ప్రభ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కడప ఎడ్యుకేషన్: విద్య, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల సాధనకు కృషి చేయాలని పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డిని ఆర్‌జేయూపీ నాయకులు కోరారు. ఈ విషయమై ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డిని పులివెందులలో ఆర్‌జేయూపీ రాష్ట్ర అధ్యక్షుడు గునిశెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఏకీకృత సర్వీసు నిబంధనల సవరణతోపాటు ఖాళీగా ఉన్న అన్ని రకాల క్యాడర్ల పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ అధికార ప్రతినిధి వీరబ్రహ్మం, టీచర్స్ హోం ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.